షేక్‌పేట్ డివిజన్ అభివృద్ధికి కృషి



వినాయకానగర్‌లో పర్యటిస్తున్న కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు సత్యనారాయణ

గోల్కొండ: షేక్‌పేట్ డివిజన్ అభివృద్ధికి కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్ యాదవ్ కృషి చేస్తున్నారని షేక్‌పేట్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు డి.సత్యనారాయణ అన్నారు. ఆదివారం ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి డివిజన్ పరిధిలోని వినాయక్‌నగర్, మణికొండ రోడ్డు, జై హింద్ కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..డివిజన్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు ఇప్పటి వరకు ఎంపీ లక్షలాది రూపాయలు కేటాయించారని, అంబేడ్కర్‌లోని హిందూ శ్మశానవాటిక అభివృద్ధికి ఆయన నిధులు కేటాయించారన్నారు. లక్ష్మీగణపతి శివాలయం ఆలయ కమిటీ చైర్మన్ సి.నర్సింగ్‌రావు, ప్రధాన కార్యదర్శులు హరి, రవి తదితరులున్నారు.

సండే..సందడి



గోల్కొండ: గోల్కొండ కోట ఆదివారం పర్యాటకులతో కిటకిటలాడింది. మండే ఎండను సైతం లెక్క చేయకుండా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన పర్యాటకులు కోటలో సందడి చేశారు. కుతుబ్‌షాహీ ఫిరంగి వద్ద యువకులు, యువ జంటలు సెల్ఫీలు దిగారు. చరిత్ర ప్రేమికులు కోటలోని ఆయుధగారంలో ఉన్న కుతుబ్‌షాహీ రాజులు వాడిని వివిధ రకాల ఆయుధాలను ఆకస్తిగా తిలకించారు. కాగా నగరంలో జరుగుతున్న మిస్ వరల్డ్ పోటీలకు వచ్చిన విదేశీ పర్యాటకులు కోటలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి



మైలార్‌దేవ్‌పల్లి: రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఓ వాహనం ఢీకొట్టిన ఘటనలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి ఈ నెల 9వ తేదీన ఉదయం 7 గటల ప్రాంతంలో టీఆర్‌జీ ఆసుపత్రి ముందు ఒక వ్యక్తి రోడ్డు దాటుతుండగా చంద్రాయణగుట్ట నుంచి దుర్గానగర్ వైపు వస్తున్న అశోక్ లేలాండ్ వాహనం నెంబర్ టిజి12టి2204ను డ్రైవర్ సయ్యద్ సోహెబ్ అజాగ్రత్తగా నిర్లక్ష్యంగా అతివేతంగా తన బండి నడిపి గుర్తు తెలియని వ్యక్తిని ఢీకొట్టాడు. దీంతో తలకు బలమైన రక్త గాయాలు కాగా డ్రైవర్ చికిత్స నిమ్మితం ఉస్మానియా ఆసుపత్రిలో అడ్మిట్ చేశాడన్నారు. గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ ఆదివారం మరణించాడన్నారు. మరణించిన వ్యక్తి వయస్సు 30–35 సంవత్సరాలు ఉంటుందని ఈ విషయమై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు లేదా ఆయన సంబంధీకులు ఎవరైనా ఉంటే మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ సిబ్బందిని ఫోన్: 87125 68230, 94906 17459లలో సంప్రదించాలని కోరారు.

శ్రమశక్తి అవార్డు గ్రహీతకు సన్మానం

అత్తాపూర్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కార్మిక శాఖ శ్రమశక్తి అవార్డు గ్రహీత రామారావును తెలంగాణ రాష్ట్ర కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో అత్తాపూర్‌లోని కుమ్మరి సొసైటీలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ తన సేవలను గుర్తించి శ్రమశక్తి అవార్డు ఇచ్చినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే కార్మికుల సమస్యలను నిరంతరం పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. తెలంగాణ రాష్ట్ర కుమ్మరి సంఘం అధ్యక్షుడు నుదునూరి కనకయ్య, ప్రధాన కార్యదర్శి కొల్లూరు అనిల్, గోల్కొండ ఉత్సవ కమిటీ చైర్మన్ కాకులారం శంకర్, యాదయ్య, శ్రీరాములు, మహేష్, శ్రీకాంత్, అప్పారెడ్డి ముఖేష్, కృష్ణ, రామకృష్ణ, అనిల్, సజ్జన్, వినోద్ పాల్గొన్నారు.



రామారావును సన్మానిస్తున్న కుమ్మరి సంఘం సభ్యులు

కార్వాన్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్



డిఫెన్స్ కాలనీలో రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కౌసర్ తదితరులు

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. ఆదివారం ఆయన లంగర్‌హౌస్ డివిజన్ డిఫెన్స్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. డిఫెన్స్ కాలనీలో వేసిన రోడ్డు, పైపులైన్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అభివృద్ధి పనులను కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యానికి వదిలేయడంతో నాణ్యత కొరవడుతుందన్నారు. దీన్ని వల్ల స్థానికులకు అసౌకర్యం కలగడమే కాకుండా ప్రజాధనం దుర్వినియోగం అవుతుందన్నారు. కార్పొరేటర్ డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ వాటి పురోభివృద్ధిని తన దృష్టికి తీసుకురావాలన్నారు. అదే విధంగా మజ్లిస్ ఏరియా కమిటీ ప్రతినిధులు సైతం తమ తమ బస్తీలలోని ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. కాగా తాను అభివృద్ధి పనుల విషయంలో గతంలో ఎన్నోమార్లు బల్దియా జోనల్ కమిషనర్, కమిషనర్‌తో కలిసి పనుల్లో నాణ్యత కొరవడతున్న విషయాన్ని ఆయన దృష్టికి తెచ్చామన్నారు. అయితే క్షేత్రస్థాయి అధికారులు పనులను పర్యవేక్షించకపోవడంతోనే నాణ్యత కొరవడుతుందన్నారు. వీడీసీసీ రోడ్లు, డ్రైనేజీ పనుల కోసం తాను అధికారులతో పోరాడి నిధులు సాధిస్తున్నానని ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించడమే తన ప్రథమ కర్తవ్యం అన్నారు.

దోమల నివారణకు చర్యలు..

టోలిచౌకీ, నదీమ్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల వారు దోమలపై ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..కొంత కాలంగా దోమలు విజృంభించి విష జ్వరాల వ్యాప్తికి కారణమవుతున్నాయన్నారు. తాను గత వారం స్వయంగా బల్దియా ఎంటమాలజీ విభాగం అధికారులతో కలిసి దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారిన చెరువులు, నాలాలను పరిశీలించడం జరిగిందన్నారు. దోమల నివారణకు ఇప్పటి వరకు తూతూ మంత్రంగా మాత్రమే పనులు జరిగాయన్న విషయంపై తనకు ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చాయన్నారు. శాతం చెరువు, లంగర్‌హౌస్ చెరువు, హాకీంపేట్ నాలా, బుల్కాపూర్ నాలా, లక్ష్మీనగర్ నాలాతో పాటు గోల్కొండ కోట కందకాలు దోమల ఉత్పత్తి కేంద్రాలుగా ఉన్నాయన్నారు. ఈ ప్రాంతాల్లో ముందుగా అక్కడ విస్తరించి గుర్రపు డెక్క, పిచ్చి మొక్కలను తొలగించాలని తాను అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. అనంతరం డ్రోన్‌ల ద్వారా దోమల మందు పిచికారీ చేయాలని ఆదేశించడం జరిగిందన్నారు. దీంతో పాటు ఇంటింటికీ తిరిగి దోమల నివారణకు మందు పిచికారీ చేయడంతో పాటు రాత్రి పూట ఫాగింగ్ చేయాలని బల్దియా ఎంటమాలజీ విభాగం అధికారులను కోరడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు హారున్‌ఫరాన్, వజీఉజ్జమా తదితరులున్నారు.

మానసిక ఆరోగ్యం ఎంతో ముఖ్యం



అవార్డు గ్రహీతలతో డాక్టర్ త్రిపురాణ వెంకటరత్నం

గన్‌ఫౌండ్రీ: ప్రస్తుత సమాజంలో మానసిక ఆరోగ్యం అత్యంత ప్రాధాన్యత గల అంశంగా మారిందని జాతీయ మహిళ కమిషన్ పూర్వ సలహాదారులు డాక్టర్ త్రిపురాణ వెంకటరత్నం అన్నారు. ఆదివారం ఆదర్శనగర్‌లోని బిర్లా సైన్స్ సెంటర్‌లో తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలువురికి టీపీఏ అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇటీవల వ్యక్తిగత జీవితం, ఉద్యోగ, విద్యా రంగాల్లో ఎదురవుతున్న ఒత్తిడులు మానసిక ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సైకాలజిస్టుల సేవలు ఎంతో కీలకమని వారి సేవలను ప్రభుత్వాలు గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. సైకాలజిస్టుల కోసం ఒక ప్రత్యేక కౌన్సిల్ ఏర్పాటు అయితే వారి సేవలకు భద్రత, గుర్తింపు లభిస్తాయని అభిప్రాయపడ్డారు. కౌన్సిల్ ఏర్పాటు కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం 20 మంది మహిళలకు తెలంగాణ ఇన్‌స్పైరింగ్ ఉమెన్ సైకాలజిస్ట్ అవార్డ్స్, పది మందికి తెలంగాణ బెస్ట్ సైకాలజిస్ట్ అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో బెస్ట్ విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ నాగజ్యోతి, సినీనటి నైనిషా రాయ్, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మోతుకూరి రాంచందర్ నాయకులు శ్రీపూజ, ఏ.సుధాకర్, వెంకటేశ్వర్లు, నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి



ఆనంద్ కుమార్ గౌడ్‌ను సత్కరిస్తున్న బస్తీవాసులు

అబిడ్స్: ప్రజా సమస్యలను జీహెచ్ఎంసీ మెట్రో వాటర్ బోర్డ్ ఇతర శాఖల అధికారులు వేగంగా పరిష్కరించాలని గోషామహల్ అసెంబ్లీ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఆనంద్‌కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. చుడిబజార్‌లో కొన్ని ఏళ్లుగా ఉన్న డ్రైనేజీ సమస్యను ఆనంద్ కుమార్ గౌడ్ వాటర్ బోర్డ్ ఎండీ, ఇతర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయడంతో ఆదివారం బస్తీవాసులు ఆయనను ఘనంగా సత్కరించారు. అనంతరం ఆనంద్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ..జీహెచ్ఎంసీ వాటర్ బోర్డ్, ఇతర శాఖల ఉన్నతాధికారులు కనీసం నెలకు ఒకటీ, రెండుసార్లు అయినా గోషామహల్ అసెంబ్లీ నియోజకవర్గంలో పర్యటించాలని అప్పుడే దీర్ఘకాలంగా ఉన్న ప్రజల సమస్యలు వారికి అర్థమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మాదిగ బంధుమిత్రం మండలి నాయకులు సుమన్‌కుమార్, బస్తీ నాయకులు నాగరాజ్ రాజేష్, ఖలీమ్, రేవతి, రేణుక, స్వరూప, విజయ్ తదితరులు పాల్గొన్నారు

ఘనంగా మదర్స్ డే



గోల్కొండ రిసాల బజార్‌లో మదర్స్ డే వేడుకలు



మాల్యాద్రిని సన్మానిస్తున్న కోలేటి దామోదర్ గుప్తా

గన్‌ఫౌండ్రీ: భారతీయ సాంప్రదాయంలో తల్లికి అంటూ ప్రత్యేకమైన రోజు లేదని అనునిత్యం మాతృ మూర్తిని పూజనీయులుగా భావించాలనే సంస్కారం మనదని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ కోలేటి దామోదర్ అన్నారు. ఆదివారం రవీంద్రభారతి ప్రధాన వేదికపై గ్లోబల్ ఈవెంట్స్ నిర్వాహణలో అంతర్జాతీయ మాతృదినోత్సవం సందర్భంగా 'మా తుజే సలాం–అమ్మా నీకు వందనం' శీర్షికన నృత్య సంగీత ప్రదర్శన జరిగింది. నాట్య గురువులు హర్షిణీ శ్రీనివాస్, కాసుల ఐశ్వర్య, రేణుక, సంస్కృతి, చంద్రి కమీనాక్షిలకు చెందిన శిష్య బృందం సుమారు రెండు వందల మంది వాగ్గేయ కారుల కీర్తనలతో చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లితండ్రులు గురువులు మార్గ దర్శకులుగా ఉత్తమ సంస్కారం పిల్లలకు నేర్పించాలన్నారు. ఈ సంగీత నృత్య ప్రదర్శనలు రైజింగ్ స్టార్స్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో నమోదుకెక్కినట్లు భారత్ వరల్డ్ రికార్డ్స్ వ్యవస్థాపకులు లయన్ కెవి.రమణారావు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత న్యాయమూర్తి మాల్యాద్రి, నటుడు కిరణ్ కుమార్, పారిశ్రామిక వేత్త చకిలం సుధాకర్, టీవీ నటి నైనిషరాయ్, మమత పాల్గొన్నారు.

రిసాల బజార్‌లో..

గోల్కొండ: భారతీయ సంస్కృతిలో అమ్మకు ఉన్నతమైన స్థానం కల్పించబడిందని గోల్కొండ జగదాంబిక మహంకాళి ఆలయ వృత్తిపని వారి సంఘం మాజీ అధ్యక్షుడు బొమ్మల సాయిబాబాచారి అన్నారు. ఆదివారం గోల్కొండ రిసాల బజార్‌లో మదర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుటుంబ పెద్దలైన సుజాతను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి సేవా సమితి అధ్యక్షులు బి.శ్రీకాంత్‌చారి, మహంకాళి ఆలయ పూజారి బి.సురేష్‌చారి, అంజమ్మ, రీనా, శివాచారి తదితరులున్నారు.

ఫెర్నాండెజ్ హాస్పిటల్‌లో..



డాక్టర్ ఎవిటా ఫెర్నాండెజ్

అబిడ్స్: హైదరాబాద్‌లోని ఫెర్నాండెజ్ హాస్పిటల్ అన్ని బ్రాంచ్‌లలో మదర్స్ డేను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అబిడ్స్ ఫెర్నాండెజ్ ఆస్పత్రిలో ఫౌండేషన్ చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎవిటా ఫెర్నాండెజ్ నగరంలోని తల్లులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..కెరీర్‌ను, కుటుంబాన్ని అద్భుతంగా సమన్వయం చేసుకుంటున్న మహిళలను అభినందిస్తున్నానన్నారు. అదే సమయంలో గృహిణుల పట్టుదల, అంకితభావం కూడా ఎంతో స్ఫూర్తిదాయకం అన్నారు.

జూన్ 2 నుంచి 'సమ్మర్ స్టూడెంట్ ప్రేనార్'

గోల్కొండ: విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీయడంతో పాటు వారిలోని నూతన ఆలోచన విధానాన్ని పెంపొందించడానికి తాము 'సమ్మర్ స్టూడెంట్ ప్రేనార్' కార్యక్రమం నిర్వహిస్తున్నామని షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ జి.రాఘవరెడ్డి అన్నారు. అటల్ ఇక్యుబేషన్ సెంటర్, జీఎన్ఐటీఎస్ నీతి ఆయోగ్‌తో కలిసి 8 నుంచి 12వ తరగతి విద్యార్థులకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. జూన్ 2 నుంచి 6వ తేదీ వరకు కళాశాల ఆడిటోరియంలో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. ఎన్ఈపీ–2020 ఆధారంగా ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. నూతన ఆవిష్కరణలు, పరిశోధన అవశ్యకత సాంకేతిక విద్యలో వస్తున్న మార్పులపై అవగాహన తదితర విషయాలపై ఈ హ్యాండ్ ఆన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. వివరాలకు 92070 81188లో సంప్రదించాలని ఆయన కోరారు.

విద్యతోనే మహిళల వికాసం



సర్టిఫికెట్ అందజేస్తున్న కార్పొరేటర్ లాల్ సింగ్, జితేందర్ సింగ్

అబిడ్స్: విద్యతోనే మహిళలు వికాసవంతులవుతారని గోషామహల్ కార్పొరేటర్ లాల్ సింగ్ పేర్కొన్నారు. మహిళలు విద్యారంగంలో రాణిస్తే వారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. ఆదివారం ధూల్‌పేటలోని లోదేశ్వర్ భవన్ లోదు క్షత్రియ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి సెజల్ సింగ్‌ను కార్పొరేటర్ లాల్ సింగ్ ఘనంగా సత్కరించి సర్టిఫికెట్ అందజేశారు. ఈ సందర్భంగా లాల్ సింగ్ మాట్లాడుతూ.. సెజల్ సింగ్ పదో తరగతిలో రాణించినట్లే పై తరగతుల్లో రాణించి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రిలయన్స్ హైటెక్ స్కూల్స్ విద్యాసంస్థల చైర్మన్ జితేందర్ సింగ్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

షేక్‌పేట్‌లో బాక్సింగ్ శిక్షణ



గోల్కొండ: బల్దియా వారు నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలలో జోష్ నెలకొని ఉంది. షేక్‌పేట్‌లో జరుగుతున్న వేసవి బాక్సింగ్ క్యాంప్‌లో టీనేజర్స్ ఎంతో ఉత్సాహంగా బాక్సింగ్ నేర్చుకుంటున్నారు. పంచులు విసురుతు ప్రత్యర్థులను పడగొడుతూ కోచ్ నుంచి కొత్త కొత్త పంచులు ఎలా విసరాలో నేర్చుకుంటున్నారు. ఇక్కడ బాక్సింగ్‌లో శిక్షణ పొందిన వారు గతంలో రాష్ట్రస్థాయి పోటీలలో పతకాలు సాధించారని బాక్సింగ్ కోచ్ బి.శివకుమార్ అన్నారు.

నేడు 'ప్రజావాణి'

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ప్రజల సౌకర్యార్థం జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఉప కమిషనర్ తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజావాణి కొనసాగుతుందన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలోని అన్ని శాఖల అధికారులు కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. అత్తాపూర్, మైలార్‌దేవ్‌పల్లి, శాస్త్రీపురం, సులేమాన్‌నగర్, రాజేంద్రనగర్ డివిజన్లకు చెందిన ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజావాణి ద్వారా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సంబంధిత శాఖల అధికారులంతా కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం అక్కడికక్కడే తగు చర్యలు తీసుకుంటారని వారు వివరించారు.

అమరులైన వీర జవాన్లకు ఘన నివాళి



మూరళీనాయక్, సచిన్ యాదవ్‌కు నివాళులర్పిస్తున్న దృశ్యం

చార్మినార్: సైనికుల సాహసంతోనే భారతదేశం ఎంతో పటిష్టంగా, సురక్షితంగా ఉందని ఓల్డ్‌సిటీ వాకర్స్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఉమేష్ గౌడ్ అన్నారు. ఆదివారం లాల్దర్వాజాలోని పూల్ బాగ్ జీహెచ్ఎంసీ ప్లే గ్రౌండ్ లో ఓల్డ్ సిటీ వాకర్స్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అమరవీరులైన మురళి నాయక్, సచిన్ యాదవులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత్ దాడులు దేశం గర్వపడేలా ఉన్నాయ న్నారు. దేశభద్రత, ఆత్మగౌరవం, నైతిక విలువలు కాపాడే ప్రయత్నంలో భాగంగా ప్రతి భారతీయుడు సైనికులకు అండగా నిలవాలన్నారు. అమెరికా పర్యటనలో ఉన్న ఓల్డ్ సిటీ వాకర్స్ అసోసియేషన్ ముఖ్య సలహాదారులు, తెలంగాణ మేధావుల ఫోర ం రాష్ట్ర శాఖ అధ్యక్షులు డాక్టర్ రాజనారాయణ ముదిరాజ్ ఒక సందేశాన్ని పంపారని అధ్యక్షులు తెలిపారు. ఆల్ ఇండియా రేడియో రిటైర్డ్ టెక్నికల్ ఆఫీసర్ టి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. దేశ సా ర్వ భౌమాధికారాన్ని కాపాడడంలో సైనికుల సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రముఖ ఆర్య సమాజ్ ప్రచార కార్యదర్శి యోగా గురువు శ్రీ ఎస్. రామకృష్ణశాస్త్రి, కే. రఘు, బి శేఖర్, ఎం కిరణ్ చారి, ఎస్ సురేందర్, బి ఆంజనేయులు చారి, ఎం శ్రీధర్ చారి, బి వెంకటేష్, హెచ్ హనుమంత్ రెడ్డి, ఈ గిరీష్ బాబు,.శ్రీనివాస్ చారి విజయ్ కుమార్, రాజ ప్రభు, బాక్సింగ్ కోచ్ ప్రతాప్ ప్రదీప్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సంగీత నృత్య నీరాజనం



అవార్డు గ్రహీతలతో సారిపల్లి కొండలరావు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాష సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఆదివారం రవీంద్రభారతిలో సర్వ కళాకారుల సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో వందే జనని భారతి పేరిట నిర్వహించిన సంగీత నృత్య నీరాజనం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు నాటక కళాపరిషత్ అధ్యక్షులు సారిపల్లి కొండలరావు మాట్లాడుతూ.. మన రాష్ట్రంలో ప్రతిభ ఉండి గుర్తింపులేని కళాకారులు ఎందరో ఉన్నారని అలాంటి వారిని వెలుగులోకి తీసుకురావాలని సంకల్పంతో పనిచేయడం అభినందనీయమన్నారు. అనంతరం పలువురు కళాకారులకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో లంక లక్ష్మీనారాయణ, బింగి నరేందర్ గౌడ్, అశోక్ పవర్, ఆర్.కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

భద్రతా చర్యలేవి..?

- చార్మినార్ కట్టడం వద్ద భద్రతను కట్టుదిట్టం చేయాలంటున్న పర్యాటకులు
- సెల్ఫీల కోసం కొంత మంది సందర్శకుల ఆరాటం



ప్రమాదపుటంచుల వరకు వెళ్లి సెల్ఫీలు తీసుకుంటున్న పర్యాటకులు (సర్కిల్ లో)

చార్మినార్: చార్మినార్ కట్టడం పైన పర్యాటకులు తమ భద్రతను గాలికొదిలి సెల్ఫీల కోసం ఆరాటపడుతున్నారు. సెల్ఫీల మోజులో తాము ప్రమాదపుటంచుల వరకు వెళుతున్నామనే విషయాన్ని విస్మరిస్తున్నారు. పర్యాటకుల భద్రత కోసం సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోకపోవడంతో చార్మినార్ కట్టడం పైన ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. గతంలో జరిగిన ప్రమాదకర సంఘటనల నేపథ్యంలో చార్మినార్ కట్టడం పైన సందర్శకులను కట్టడి చేయడానికి ఆర్కియాలజీ విభాగం అధికారులు నియమించిన ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నిరంతర నిఘా కోసం ఏర్పాటు చేసిన సెక్యూరిటీ సిబ్బంది రానురాను ఆలసత్వం ప్రదర్శిస్తుండడంతో సందర్శకులు చార్మినార్ కట్టడం పైన తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. వీకెండ్ రోజుల్లో సందర్శకుల సందడి ఎక్కువగా ఉంటున్నందున భద్రతను మరింత కట్టుదిట్టం చేయాల్సిన అవసరం ఉంది.

పిట్టగోడల అంచుల వరకు వెళ్లకుండా నియంత్రించాలి..

చార్మినార్ పిట్టగోడల అంచుల వరకు వెళ్లకుండా పర్యాటకులను అడ్డుకోవాలి. కొనవరకు వెళ్లకుండా గతంలో గోలుసులతో బారికేడ్లను సైతం ఏర్పాటు చేశారు. వీటిని పట్టించుకోని సందర్శకులు పిట్టగోడల చివరి వరకు వెళ్లి సెల్ఫీలు తీసుకోవడమే కాకుండా వాటిపై కూర్చుని ఫొటోలకు ఫోజులిస్తున్నారు. సందర్శకుల భద్రతను దృష్టిలో ఉంచుకొని విధి నిర్వహణలోని సెక్యూరిటీ సిబ్బంది వారిని నియంత్రించాల్సి ఉన్నప్పటికీ..నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో సందర్శకులు ప్రమాదాల అంచుల వరకు వెళుతున్నారు. ప్రమాదాలు జరిగిన తర్వాత హడావుడి చేయడం కన్నా.. ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటే బావుంటుందని కొంత మంది పర్యాటకులు అంటున్నారు.

ముగిసిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్



వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు ఉపాధ్యాయులు

అఫ్జల్‌గంజ్: భారత సాంకేతిక విద్యామండలి, న్యూఢిల్లీ, ఎస్‌సీసీఐపీల సంయుక్తాధ్వర్యంలో జరిగిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (సార్వత్రిక మానవీయ విలువలు) స్ఫూర్తి ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం ముగిశాయి. వాలెడిక్టరీ సెషన్ సందర్భంగా చైర్మన్ చలమారెడ్డి, సెక్రటరీ జగన్‌మోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ గిరిధర్ ఆకుల, ఐక్యూ ఏసీ కో ఆర్డినేటర్ గాయత్రీ పావనీ మానవ విలువల ప్రాముఖ్యతను వివరించారు. మహారాష్ట్ర నుంచి వచ్చిన కార్యక్రమ నిపుణురాలు నిధి చిరాగ్, జేఎన్‌టీయూ అనంతపురం నుంచి వచ్చిన సహ సమన్వయకర్త ప్రసాంతి, పరిశీలకురాలు ఇష్రత్ మీరా మిర్జానా పాల్గొన్నారు.

రిహార్సల్స్‌తో తగ్గిన సందడి





చిరువ్యాపారులను అనుమతించకపోవడంతో నిర్మానుష్యంగా చార్మినార్ రోడ్డు

చార్మినార్: మిస్ వరల్డ్–2025 పోటీదారులు ఈ నెల 13న చార్మినార్‌లో హెరిటేజ్ వాక్ నిర్వహించనున్నందున ఆదివారం రిహార్సల్స్ జరిగాయి. ఈ సందర్భంగా మధ్యాహ్నం వరకు మాత్రమే సందర్శకులను అనుమతించడంతో చార్మినార్ కట్టడం వద్ద కొద్ది సంఖ్యలోనే కనిపించారు.

చిరు వ్యాపారులకు కూడా అనుమతి లేకపోవడంతో వీధులన్నీ నిర్మానుష్యంగా మారాయి. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. సహజంగా వీకెండ్ అయిన ఆదివారం సందర్శకుల సందడి ఎక్కువగా ఉంటుంది. దీంతో అత్యధిక సంఖ్యలో వచ్చిన సందర్శకులకు తిప్పలు తప్పలేదు. ముందస్తు సమాచారం లేకపోవడంతో ఇబ్బందులకు గురయ్యారు.

చుక్కలు చూపించిన వీధి కుక్కలు..

చార్మినార్ వద్ద జీహెచ్ఎంసీ డాగ్ క్యాచర్ సిబ్బందికి వీధి కుక్కలు చుక్కలు చూపించాయి. రిహార్సల్స్ సందర్భంగా పోలీసు బాస్‌లతో పాటు జీహెచ్ఎంసీ, టీఎస్ఎస్‌పీడీసీఎల్, పర్యాటక, ఎఎస్ఐ, జలమండలి తదితర ప్రభుత్వ విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో గ్రామ సింహాలు కాస్త ఇబ్బందులు కలిగించాయి. విషయం తెలిసిన వెంటనే జీహెచ్ఎంసీ వెటర్నరి విభాగం సిబ్బంది రంగంలోకి దిగి గ్రామ సింహాలను కట్టడి చేశారు.